వంద కుటుంబాల వలస



గుడేకల్లు గ్రామం నుంచి వాహనంలో నాగర్‌కర్నూలుకు వలస వెళ్తున్న కూలీలు

ఎమ్మిగనూరు/రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో అప్పుడే వలసలు మొదలయ్యాయి. ప్రతి రోజూ గుడేకల్లు, మసీదుపురం, కడివెళ్ల, కందనాతి తదితర గ్రామాల నుంచి రైతు కూలీలు పొట్ట చేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. బుధవారం ఒక్క రోజే మండలంలోని గుడేకల్లు గ్రామం నుంచి ఎనిమిది బొలేరోల్లో దాదాపు వంద కుటుంబాలు తెలంగాణ ప్రాంతంలోని నాగర్‌కర్నూలుకు వలస వెళ్లాయి. రైతు కూలీలు తమతోపాటు చిన్నారులను సైతం వెంట తీసుకెళ్తుండడంతో చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది.

గ్రామాల్లో తగ్గిన పనులు

మండలంలో 15 రోజులుగా ఆయా గ్రామాల్లో కూలి పనులు తగ్గిపోతూ వస్తున్నాయి. ముఖ్యంగా పత్తి, ఉల్లి వంటి పంటలు సాగు చేసిన రైతుల పొలాల్లో పనులు తగ్గిపోయాయి. దీంతో గ్రామాల్లో పనులు దొరకడం కష్టంగా మారింది. ఎక్కడో ఒక చోట పనులు ఉన్నప్పటికీ కూలి గిట్టుబాటు కావడం లేదు. దీంతో కూలీలు వలస బాట పడుతున్నారు.

గుడేకల్లు నుంచి తెలంగాణకు కూలీలు



చదువుకుంటున్న చిన్న పిల్లలను వలస తీసుకెళ్తున్న దృశ్యం

నాగర్ కర్నూలుకు వలస వెళ్తున్నాం



గ్రామంలో పనులు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. నాకు నలుగురు సంతానం. రోజు కూలికి వెళ్తేగాని పూటగడవదు. ఇక్కడ ఉంటే పనులు దొరక్క ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చేసిన అప్పులు కూడా తీర్చుకోలేం. అందుకే తెలంగాణ ప్రాంతానికి వలస వెళ్తున్నాం. ఇంటి దగ్గర పిల్లలను చూసుకునేవారు లేకపోవడంతో మా వెంటే తీసుకెళ్తున్నాం.

- ఈరప్ప, గుడేకల్లు

ఊళ్లో పనులు లేవు



ఉన్న ఊళ్లో పనులు తగ్గిపోయాయి. తెలంగాణ ప్రాంతంలో కేజీల ప్రకారం పత్తి విడిపించుకుంటే కూలి గిట్టుబాటు అవుతుంది. అక్కడైతే పత్తి విడిపించడం, మిరప పంటను కోయడం, పొలాల్లో నీరు కట్టడం వంటి పనులు ఎక్కువగా ఉంటాయి. కుటుంబమంతా పనులకు వెళ్తే మా కష్టాలు కొంతైనా తీరుతాయి.

- వెంకటేశ్వర్లు, గుడేకల్లు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం ఉదయం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులతో వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జలవనరుల శాఖ, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు, నది పరివాహక ప్రాంతాల్లో అకస్మిక వరదలు వచ్చినా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ సెక్రటరీల ద్వారా గ్రామాల్లో డ్రైయిన్స్‌ను శుభ్రం చేయించాలని ఆదేశించారు. సుంకేసుల, కేసీ కెనాల్, బండ్స్ వేదవతి నది, పెద్ద పెద్ద వాగులకు గండ్లు పడకుండా సిమెంటు ఇసుకలను సిద్ధంగా ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ ఎస్ఈని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏల ద్వారా పరిస్థితిని పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. ఇది పంట కోత సమయం కాబట్టి నష్టపోకుండా రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. పత్తికొండ, ఆదోని, ఆలూరు, సి. బెళగల్, చిప్పగిరి, మద్దికెర మండలాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ఆ మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి. నవ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, జిల్లా విపత్తు నిర్వహణ అధికారి అనుపమ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అప్రమత్తం

కంట్రోల్ రూం ఏర్పాటు

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని కర్నూలుటౌన్, ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్‌లలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తుఫాను ప్రాభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి అధికారులు, సిబ్బందితో కూడిన బృందాలు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లా వినియోగదారులు, రైతులు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భద్రత నియమాలు పాటించాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం నాలుగు కంట్రోల్ రూములను అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లా కంట్రోల్ రూం -7382614308, కర్నూలు డివిజన్ -08518 221919, ఎమ్మిగనూరు డివిజన్- 73827 87703, ఆదోని డివిజన్ - 7382614098 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్ఈ కోరారు.

క్లస్టర్ కష్టాలు..!

ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల అది. ఎప్పుడో 57 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో విద్యార్థులు చదువుకుంటున్నారు. క్లస్టర్ యూనివర్సిటీలో ఈ కాలేజీని అంతర్భాగం చేశాక రూసా నిధులు రూ.16.06 కోట్లతో అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మించారు. దాదాపు 92 శాతం పనులు పూర్తయ్యాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేయడానికి విద్యుత్ శాఖకు రూ.24 లక్షలు డిపాజిట్ చేయాలి. ఆ నిధుల కోసం ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో రూ.కోట్లు వెచ్చిన భవనాలు నిరుపయోగంగా మారాయి.

- రూ.16.06 కోట్లతో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలకు అధునాతన భవనాలు
- 90 శాతానికి పైగా పూర్తయిన పనులు
- ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.24 లక్షలు డిపాజిట్ చేయని వైనం
- రూ.కోట్లు వెచ్చించినా నిరుపయోగం
- 57 ఏళ్ల నాటి పాత భవనాల్లో విద్యార్థుల అవస్థలు



బి.క్యాంప్‌లో రూసా నిధులతో నిర్మించిన ప్రభుత్వ మెన్ డిగ్రీ కళాశాల భవనం

కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):

కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల ఎందరో మేధావులను అందించింది. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కేవీఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలను సిల్వర్‌జూబ్లీలో విలీనం చేసి క్లస్టర్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది దక్షిణ భారత దేశంలో ఏకైక క్లస్టర్ విశ్వ విద్యాలయం. ఈ మూడు డిగ్రీ కళాశాలలకు అడ్మినిస్ట్రేషన్ భవనం, లైబ్రరీ, ఇన్‌ఫర్మేషన్ సెంటర్, క్యాంటీన్, విద్యార్థుల వసతి గృహాలు.. వంటి వాటి నిర్మాణానికి క్లస్టర్ యూనివర్సిటీలో భాగంగా రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) కింద కేంద్ర ప్రభుత్వం రూ.55 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం 90 శాతం ఇస్తే.. రాష్ట్ర వాటాగా పది శాతం నిధులు ఇవ్వాలి. ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏఈడబ్ల్యూఐడీసీ) ఇంజనీర్ల పర్యవేక్షణలో చేపట్టిన ఈ పనులు విజయవాడకు చెందిన శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్ సంస్థ దక్కించుకుంది. బి. క్యాంపులో ఉన్న సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.26.39 కోట్లు, కేవీఆర్ బాలికల డిగ్రీ కళాశాలకు రూ.16.54 కోట్లు, బి. క్యాంపులోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలకు రూ.16.06 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో కూడా అడ్మినిస్ట్రేషన్, అకాడమీ బ్లాక్, క్యాంటిన్, విద్యార్థుల వసతి గృహం భవనాలు జీ+2 తరహాలో నిర్మించారు. కేంద్రం ఇచ్చిన రూసా నిధులతో కాంట్రాక్ట్ సంస్థ పనులు వేగంగా చేసింది. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం పది శాతం వాటా నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టరు పనులు ఆపేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక బకాయి రూ.12 కోట్లలో రూ.7 కోట్లు చెల్లించడంతో అసంపూర్తి పనులకు మోక్షం లభించింది.

మిగతా 6లో..

మిరప ధర పతనం

- తెగుళ్లతో దెబ్బతిన్న పంట
- కూలి ఖర్చులు కూడా రాని వైనం
- మిరప పంటను తొలగిస్తున్న రైతులు
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన



చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఏటా ఏదో ఒక కారణంతో నష్టాలు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది పచ్చిమిర్చి పంటకు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. నిన్నా మొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న పచ్చిమిర్చి ధర నేడు అమాంతంగా పడిపోయింది. ధర పతనానికి తోడు మిర్చి పంటను తెగుళ్లు దెబ్బతీశాయి. జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, పత్తి తరువాత పచ్చిమిర్చి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల, పాణ్యం, బనగానపల్లె మండలాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. జిల్లాలో 12,362 హెక్టార్లలో సాధారణంగా మిర్చి సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు 6,420 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మిరపలో నలుపు రకానికి చెందిన కృష్ణ, తెలుపు కాయలకు సంబంధించి డింపుల్ రకాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ధరలు పతనం కావడం, మిరపకు తెగుళ్ల ఉధృతి అధికం కావడంతో రైతులు సాగు వైపు ఆసక్తి చూపడం లేదు.

మిగతా 6లో..



డి.వనిపెంటలో మిరపను దున్నేస్తున్న రైతు

నిండు కుండలా శ్రీశైల జలాశయం

- 884.40 అడుగులకు చేరుకున్న నీటి మట్టం
- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



శ్రీశైలం, అక్టోబరు 16: శ్రీశైలం జలాశ యం నీటి మట్టం 884.40 అడుగులకు చేరుకుంది. జలాశయానికి బుధవారం వరద ప్రవాహం కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో బుధవారం తెరవాల్సిన డ్యాం క్రస్టుగేట్లను తాత్కాలికంగా అధికారులు వాయిదా వేశారు. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 39,357 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 34,216 క్యూసెక్కులు మొత్తం 73,573 వరద నీరు వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 78,645 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.40 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 211.9572 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,826 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,900 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

భారీ వర్షం


- చాగలమర్రిలో 52.9 మి.మీ., వర్షపాతం



గొడిగనూరు రహదారిలో విరిగి పడ్డ మహా వృక్షం

చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. 52.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించిపోయాయి. గోపాయలపల్లె రహదారిలోని అడ్డవాగు పొంగి ప్రవహించి పంటలు నీట మునిగాయి. మొక్కజొన్న, కంది, పత్తి, మినుము పంటలు వర్షానికి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి మొలకలు రావడంతో భారీగా నష్టపోయారు. గొడిగనూరు గ్రామంలో రహదారిపై వందేళ్ల చింత చెట్టు నేలకొరిగి రాకపోకలకు అంతరాయం కలిగింది. తోడెండ్లపల్లె గ్రామంలో శ్రీరాములుకు చెందిన మట్టిమిద్దె కూలింది. ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. గొడిగనూరు తదితర గ్రామాల్లో మట్టి మిద్దెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంట పొలాలు, మట్టి మిద్దెలకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నేడు వాల్మీకి జయంతి



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితానికి తరతరాలుగా ఆదర్శంగా నిలుస్తున్న రామాయణ చరిత్రను సమాజానికి అందించిన ఆది కవి వాల్మీకి జయంతిని ఏటా అక్టోబరు 17న నిర్వహిస్తున్నారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది. ఇందుకోసం ప్రత్యేక నిధులను సైతం వెచ్చించి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా అధికారగణంతో పాటు, వాల్మీకి కుల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించడానికి నాయకులు సిద్ధమయ్యారు.

247 మంది పోలీసుల బదిలీ

కర్నూలు క్రైమ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా 247 మంది పోలీసులను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్లకు మించి ఒకేస్థానంలో విధులు నిర్వహిస్తున్నవారిని, అటాచ్‌మెంట్లులో ఉన్న వారినీ, అనారోగ్యాల కారణాలతో రిక్వెస్టు పెట్టుకున్న వారిని బదిలీ చేశారు. పది రోజుల కింద వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. దసరా, బన్ని ఉత్సవాలు, తిరుమల బందోబస్తు కారణంగా ఈ బదిలీ కాస్త ఆలస్యమైంది. బదిలీ అయిన వారిలో 132 మంది కానిస్టేబుళ్లు, 86 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 29 మంది ఏఎస్ఐలు ఉన్నారు.



- జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న వీరేష్
- పట్టుదల ముందు చిన్నబోయిన పేదరికం
- ఆటో డ్రైవర్ కుమారుడి ప్రతిభ
- రెండేళ్లుగా కర్నూలులో కఠోర శిక్షణ

యువ

వెయిట్ లిఫ్టింగ్ వీరుడు

బాణాన్ని ఎంత వెనక్కి లాగితే అంతగా అది ముందుకు దూసుకుపోతుంది. వీరేష్ కూడా ఎక్కుపెట్టిన బాణమే. పేదరికం అడ్డువచ్చినా వెనక్కు తిరిగి చూడలేదు. ఇష్టమైన వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువకుడి పట్టుదల ముందు పేదరికం చిన్నబోయింది. కౌతాళం మండలంలోని మారుమూల ఉన్న తోవి గ్రామానికి చెందిన బైరిగడ్డ వీరేష్ వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.


వీరేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్

కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన బైరిగడ్డ అయ్యన్న, హనుమంతమ్మ దంపతుల కుమారుడు బైరిగడ్డ వీరేష్ ప్రస్తుతం బీఏ సెకండ్ ఇయర్ చదవుతున్నాడు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరేష్ ఇక్కడి నుంచి 5వ తరగతి వరకు కౌతాళం మండలం తోవి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. 6 నుంచి 10 వరకు విజయవాడ స్పోర్ట్స్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్ ఎస్వీ కళాశాల, తిరుపతిలోనూ, ఆదోనిలో ఆర్ట్స్ కళాశాలలో బీఏ చదువుతున్నాడు. విజయవాడ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్నప్పటి నుంచే వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. ఆపై జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంలో కృషి చేశాడు. పేదరికం అడుగడుగున అవాంతరాలు సృష్టిస్తున్నా.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని వెయిట్ లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ఈ క్రమంలో హిమాచల్‌ప్రదేశ్‌లో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు ఎంపికయ్యాడు.


బంగారు పతకాలతో వీరేష్

ఇంటర్నేషనల్ పోటీలే లక్ష్యం

ఈనెలలో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2024 కోసం కోచ్ యూసుఫ్ బాషా ఆధ్వర్యంలో గట్టిగా ప్రయత్నిస్తున్నా. జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్ పోటీల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తున్నా. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానన్న ధీమా ఉంది. స్పాన్సర్స్ ముందుకు వచ్చి సహాయం చేస్తే మంచి పేరు తీసుకొస్తా.

- బైరిగడ్డ వీరేష్, వెయిట్ లిఫ్టర్

సాధించిన పతకాలు ఇవే..

- 2019 ఫిబ్రవరి 14 తేదీల్లో కేరళలో జరిగిన సౌజన్య నేషనల్‌లో నాలుగో స్థానం
- 2022 మార్చి 23న కర్నూలు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌లో మొదటి స్థానం
- 2022 జూన్ 8, 10 తేదీల్లో జరిగిన ఏపీ వెయిట్ లిఫ్టింగ్‌లో మూడో స్థానం
- 2022 జులై 16, 1 తేదీల్లో నంద్యాలలో జరిగిన పవర్ లిఫ్టింగ్‌లో మొదటి స్థానం
- 2023 జనవరి 25న వెయిట్ లిఫ్టింగ్‌లో సీఎం కప్ సెలక్షన్‌లో మొదటి స్థానం
- 2023 మే 15న తిరుపతిలో జరిగిన సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్‌లో మూడో స్థానం
- 2022లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం
- 2019లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగిన సౌత్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం.
- 2023లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో జరిగిన పోటీల్లో 61 కిలోల విభాగంలో స్నాచ్113 కిలోలు, క్లీన్/జర్క్‌లో 138 కిలోల బరువు (మొత్తం 251 కిలోలు) ఎత్తి జూనియర్, సీనియర్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. రాష్ట్ర స్థాయిలోనే బెస్టు లిఫ్టర్ అవార్డును సైతం సొంతం చేసుకున్నాడు
- 2024 ఆగస్టు నెలలో అనకాపల్లి జిల్లాలో జరిగిన 11వ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 51 కిలోల విభాగం పోటీల్లో పాల్గొని 109 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 135 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించాడు. సీనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మైత్రి చౌదరి ప్రతిభ



ఇండియా త్రోబాల్ జట్టులో మైత్రి చౌదరి

బేతంచెర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రోబాల్‌లో బేతంచెర్ల విద్యార్థిని మైత్రి చౌదరి చదువుతోపాటు పాటు క్రీడల్లో రాణిస్తోంది. బేతంచెర్ల పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త తిరుమలేశ్ చౌదరి, ఉమా మహేశ్వరి దంపతుల కుమార్తె మైత్రి చౌదరి హైదరాబాదులోని వీఏఎస్ఆర్ విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. మైత్రి చౌదరి ఇండో థాయిలాండ్ త్రోబాల్ టెస్టు సిరీస్-2024 అంతర్జాతీయ త్రోబాల్ పోటీలు బ్యాంకాక్‌లోని కసెమ్‌బండిట్ యూనివర్సిటీలో ఈ నెల 10న జరిగాయి. ఈ పోటీల్లో శ్రీలంక, ఇండియా, బంగ్లాదేశ్, థాయిలాండ్ తదితర దేశాలకు చెందిన జట్లుతలబడ్డాయి. పోటీల్లో మైత్రి చౌదరి తెలంగాణ జట్టు తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి షీల్డ్, మెడల్ ప్రశంసాపత్రం అందుకుంది. మైత్రి చౌదరిని కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులు పలువురు అభినందించారు.


షీల్డ్ అందుకుంటున్న మైత్రి చౌదరి

నూతనంగా నిర్మించిన లైబ్రరీ



సీసీఐ ఉద్యోగాలకు ముగ్గురి ఎంపిక

మహానంది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల వెలువరించిన ఫలితాల్లో మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు మూడు ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన సీసీఐ పరీక్షల్లో కళాశాలకు చెందిన 2018-2022వ బ్యాచ్ విద్యార్థిని టి.లక్ష్మీభార్గవి మొదటి ర్యాంకు సాధించి వరంగల్‌లోని సీసీఐలో ఉద్యోగం సాధించింది. అలాగే ఇదే కళాశాలలో చదివిన మరో విద్యార్థి రవిచంద్ర 39వ ర్యాంక్ సాధించి వరంగల్ సీసీఐలోనే ఉద్యోగం సంపాదించాడు. అలాగే 76వ ర్యాంక్ సాధించిన మరో విద్యార్థి మధుకుమార్ గుంటూరు సీసీఐలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వీరిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి, శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందించారు.


టి.లక్ష్మీభార్గవి


బి.రవిచంద్ర


మధుకుమార్

జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురండి - కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి : స్వర్ణాంధ్ర 2047లో భాగంగా నంద్యాల జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో అధికారులు నిర్దిష్ట లక్ష్యంతో పనుల చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థూల దేశీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై జిల్లా అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి ప్రతి ఏడాది15శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో పనిచేయాలనే ముఖ్యమంత్రి ఆదేశం మేరకు అన్ని శాఖలు తమ వృద్ధి రేటును ప్రతి ఏటా 15శాతం పెంచుకుంటా నిర్దిష్ట ప్రణాళికలతో పని చేయాలన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలతో పాటు విద్య, వైద్యం, ఇరిగేషన్ తదితర అన్ని రంగాలలో అభివృద్ధి నివేదికలు తయారు చేసే విధానంపై నిపుణులైన మాస్టర్లచే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా స్థాయి ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

లోక్ అదాలత్‌లో న్యాయం

బాధితుడికి రూ.3 లక్షలు

కర్నూలు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి లైసెన్సు కాల పరిమితి ముగియడంతో నష్టపోయిన ఫిర్యాదుదారుడికి శాశ్వత లోక్ అదాలత్ జోక్యం వల్ల న్యాయం జరిగింది. ఈ మేరకు వైద్య ఖర్చులు చెల్లించేందుకు సదరు ఆసుపత్రి అంగీకరించినట్లు కర్నూలు శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాలకు చెందిన ఫిర్యాదుదారుడు కర్నూలు టీబీ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన అనారోగ్యానికి గురి కావడంతో మెడికల్ రీయింబర్స్‌మెంటు సదుపాయం ఉన్న సన్‌షైన్ ఆసుపత్రిలో గత ఏడాది ఏప్రిల్ 13న అడ్మిట్ అయ్యాడు. ఆ తర్వాత డిశ్చార్జ్ అయి రూ.4,17,611 బిల్లులను మెడికల్ రీయింబర్స్‌మెంటు కింద రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆయన లైసెన్సు పునరుద్ధరణ కాలేదని, ఆ ఆసుపత్రి కిమ్స్ ఆసుపత్రిలో విలీనమైపోయిందనే కారణాలతో ఫిర్యాదుదారుడు చేసుకున్న క్లెయిమ్‌ను ఏపీ వైద్యఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు తిరస్కరించింది. దీంతో ఖంగుతిన్న ఆయన శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు సన్‌షైన్ ఆసుపత్రి అధికారులు శాశ్వత లోక్ అదాలత్‌కు హాజరై రూ.3 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ఫిర్యాదికి చెల్లించేందుకు అంగీకరించారు. దీంతో ఫిర్యాది తన కేసును ఉపసంహరించుకునేందుకు అంగీకరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ తెలిపారు.


చెక్కును అందజేస్తున్న శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ తదితరులు

క్లస్టర్ కష్టాలు..!

5వ పేజీ తరువాయి

బి. క్యాంపులోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. 57 ఏళ్ల క్రితం నిర్మించిన పాత భవనాలే శరణ్యం. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో విద్యార్థులు దినదినగండంగా కాలం వెళ్లదీస్తున్నారు. పక్కనే రూ.16.06 కోట్లతో నిర్మించిన అధునాతన సౌకర్యాలతో నిర్మించిన అందమైన భవనాలు ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి ఉంది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టరుకు చెల్లించడంతో భవన నిర్మాణాలతో పాటు పెయింటింగ్ (రంగులు), ప్లంబింగ్, ఎలక్ట్రికల్.. వంటి పనులు 90 శాతానికి పైగా పూర్తి చేశారు. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఈ భవనాలు వినియోగంలోకి రావాలంటే ట్రాన్స్‌ఫారం ఏర్పాటు కోసం రూ.24 లక్షలు విద్యుత్ శాఖకు డిపాజిట్ చేయాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం కాంట్రాక్ట్ సంస్థ ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీర్లకు లేఖ రాసింది. కలెక్టరు పి. రంజిత్‌బాషా జోక్యం చేసుకొని ట్రాన్స్‌ఫారం డిపాజిట్ డబ్బులు తక్షణమే విడుదల చేయించి.. విద్యార్థులకు నూతన భవనాలు అందించాలని పలువురు కోరుతున్నారు. కాగా.. ఈ భవనాలను తమకు కేటాయించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ (వీసీ) రాష్ట్ర ఉన్నత విద్యామండలికి లేఖ రాశారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఉన్నత విద్యా మండలి లేఖ రాసింది. ఆ లేఖకు స్పందించిన ప్రిన్సిపాల్.. ప్రస్తుతం 57 ఏళ్ల కిందటి భవనాల్లో కనీస వసతులు లేక డిగ్రీ చదివే పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ వసతి లేకపోవడంతో బాలికల డిగ్రీ అడ్మిషన్లు తగ్గుతున్నాయి. పేద విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా రూసా నిధులతో నిర్మించిన నూతన భవనాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకే అవసరం ఉందని లేఖ రాయడం ఆ సమస్య అక్కడితో ఆగిపోయింది.


హాస్టల్ భవనం

త్వరలోనే విద్యార్థులకు అప్పగిస్తాం



రూసా నిధులు రూ.55 కోట్లతో చేపట్టిన కేవీఆర్ బాలికల డిగ్రీ కళాశాల, ప్రభుత్వం బాలుర డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనాల నిర్మాణాలు 90 శాతానికిపైగా పూర్తయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.24 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంది. త్వరంలో విద్యార్థుల వినియోగంలోకి ఆ భవనాలు తీసుకొస్తాం. ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రస్తుతం 57 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాల్లో నడుస్తోంది. నూతన భవనాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకే అవసరం ఉందని ఆ కాలేజీ ప్రన్సిపాల్ విద్యా శాఖకు లేఖ రాశారు.

- డీవీఆర్ సాయి గోపాల్, వైస్ చాన్సలర్, క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు

మిరప ధర పతనం

5వ పేజీ తరువాయి

మిరప కాయలను రైతులు ఆటోలలో మైదుకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ తదితర మార్కెట్‌లకు తరలించి విక్రయిసున్నారు. అయితే ధరలు పడిపోవడం వల్ల రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.350 చొప్పున చెల్లిస్తుండగా ఆ మొత్తమైన రావడం లేదు. 50 కిలోల సంచి రూ.300 పలుకుతోంది. రూ.300కే దళారులు కొంటున్నారు. దీంతో కిలో రూ.5 నుంచి రూ.6 మాత్రమే మార్కెట్‌లో ధర వస్తున్నదని తెలిపారు. ఈ మొత్తం కూలీలకు రవాణాకు సరిపోతుందని రైతులు విలపిస్తున్నారు. మిరప పంట పొలం నుంచి రైతులు సొంతంగా మార్కెట్‌కు తరలించినందుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఆటోలకే చెల్లించాల్సి వస్తున్నది. దీంతో మిరప పంట సాగు చేసి నష్టపోయామని వాపోతున్నారు.

పంట తొలి దశలో రూ.2 వేలు

జిల్లాలో సాగు చేసిన మిరప పంట జూలై మూడో వారంలో తొలి కోత దశకు వచ్చింది. పంట చేతికొచ్చే సమయంలో 50 కేజీలు రూ.750 ధర పలికింది. ఇవే ధరలు రెండు నెలల పాటు కొనసాగితే తమ అప్పులన్నీ తీరిపోతాయని రైతులు అనుకున్నారు. కానీ కేవలం వారం రోజులే ఈ ధర పలికింది. 8వ రోజు నుంచి ధర పతనమవుతూ కిలో రూ.5కు చేరింది. నెల రోజుల్లోనే భారీగా పచ్చిమిర్చి ధరలు పతనమయ్యాయి. కాయలు కోసేందుకు వచ్చే కూలీలకు ఇవ్వడానికి కూడా ఈ డబ్బు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. మరో వైపు రుద్రవరం, చాగలమర్రి తదితర మండలాల్లో సాగు చేసిన మిరపలో అధిక శాతం మిరప పంట బింగి తెగుళ్ల బారిన పడింది.

ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి

జిల్లాలోని రైతులు మిరప మొక్కల కోసం గుంటూరు వెళ్తుంటారు. ఒక్కో మొక్కను రూ.1 నుంచి రూ.5 వరకు ధర


కొత్తపల్లెలో తెగుళ్లతో దెబ్బతిన్న మిరప తోట


పచ్చిమిర్చిని కోస్తున్న మహిళా కూలీలు

పెట్టి కొంటారు. మరి కొంత మంది రైతులు నర్సరీల్లో కొంటారు. అధిక శాతం మంది రైతులు మిరప నారునే కొని నాటుతారు. నాలుగు నెలల పాటు మిరప పంటను కాపాడుకుంటారు. ఎకరాకు సుమారుగా 40 వేల మొక్కలను నాటుతున్నారు. మందులు, కూలీలు, కలుపు నివారణ కోసం ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. కానీ తెగుళ్ల సోకడం, ధరలు పడిపోవడంతో ఎకరాకు రూ.40 వేలు కూడా రావడం లేదు. దీంతో ఒక్కో ఎకరాకు రూ.60 వేల వరకు నష్టపోతున్నారు. మరో వైపు కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మార్కెట్‌లో పచ్చి మిర్చి ధరలు నిలకడగానే కొనసాగుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లో కేజీ రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. కానీ రైతులకు మాత్రం కేజీ రూ.5 నుంచి రూ.6లతో సరిపెడుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కూరగాయలు సాగు చేసే రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు

జిల్లాలోని ఆయా మండలాల్లో మిరప సాగు చేసిన రైతులు ధర లేక పోవడంతో ట్రిల్లర్లతో దున్నేస్తున్నారు. ప్రస్తుతం రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో ధర లేక తెగుళ్లతో దెబ్బతిన్న పంటను ట్రిల్లర్లతో తొలగిస్తున్నారు. డి.వనిపెంట, ఆలమూరు, బీరవోలు, చందలూరు, చిన్నకంబలూరు, రుద్రవరం, టి.లింగందిన్నె గ్రామాల్లో రైతులు మిరప పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు దృష్టి సారించారు.

గిట్టుబాటు కావడం లేదు



మిరపకు మార్కెట్‌లలో ధర లేక నష్టపోయాం. రెండు ఎకరాల్లో మిరప సాగు చేశా. ఎకరాకు రూ.90 వేలు పెట్టుబడి పెట్టా. పంట కోతకు వచ్చే సమయంలో ధర పడిపోయింది. వచ్చిన మిరప పంట కూలీలకు, రవాణా ఖర్చులకే సరిపోతున్నది. ఆలమూరు నుంచి వ్యాపారులు వచ్చి మిరపను కొనుగోలు చేస్తారు. వారు చెప్పిన ధరకే ఇవ్వాల్సి వస్తోంది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు.

-ఈశ్వర్‌రెడ్డి, రైతు, కొత్తపల్లె గ్రామం

పంటను దున్నేశా



తెల్లమిరప పంట సాగు చేసి భారీగా నష్టపోయా. 4 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఒక్కో ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టా. తెగుళ్ల సోవడంతో వారానికి రెండు సార్లు మందులు పిచికారి చేశా. అయిన తెగుళ్ల తగ్గలేదు. ధరలు కూడా లేవు. రూ.4 లక్షలు ఖర్చు చేసిన పెట్టిన పెట్టుబడి, కూలీల డబ్బు రాకపోవడంతో పంటను దున్నేశా. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

-వీరయ్య, రైతు, డి. వనిపెంట గ్రామం

పెట్టుబడులు రావడం లేదు



నాలుగు ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశా. ధర పతనమైంది. మిరప పంట దిగుబడి బాగానే ఉంది. ధర లేక పోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. మార్కెట్‌కు తీసుకెళ్తే రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. పంటలకు తెగుళ్ల సోకితే ఏ మందు పిచికారి చేసుకోవాలో అధికారులు చెప్పడం లేదు. తెగుళ్ల, ధరలు లేకపోవడంతో భారీగా నష్టపోతున్నాం. ప్రత్యామ్నాయ పంట సాగు చేయడానికి మిరప పంటను దున్నేశాను.

-చిన్నబయన్న, రైతు, డి. వనిపెంట గ్రామం

న్యూస్ బాక్స్

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు, అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, ఎం.ఏ, ఎం.కామ్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహులు తెలిపారు. కన్వీనరు కోటాలో మిగిలిన సీట్లకు ఏపీపీజీసెట్-2024 అర్హత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 17, 18 తేదీల్లో వర్సిటీలోని అడ్మినిస్ట్రేషన్స్ కార్యాల యంలో ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాల యంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉర్దూ వర్సిటీలో..

నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యాసంవత్స రానికి పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహి స్తున్నట్లు రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. పీజీ కోర్సుల్లో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ ఎకానామిక్స్, ఎంఏ ఉర్దూ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ బాటనీ, ఎంఎస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో చేర్చుకునేం దుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావా లన్నారు. 8341511632, 9959758609కు సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఆర్సీ కార్యదర్శిగా చిరంజీవి బాధ్యతలు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌ఆర్సీ అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషన్ ప్రజా పౌర సంబంధాల అధికారి హను మంతరెడ్డి, సునీత, నరసింహకుమార్, సురేష్‌బాబు, శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

టెట్‌కు 673 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టెట్‌కు మొత్తం 4369 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం పరీక్షకు 2083 మందికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 673 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో 1763 మంది హాజరు కాగా 320 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 2286 మంది మందికి గానూ 1933 మంది హాజరు కాగా, 353 మంది గైర్హాజరయ్యారు. డీఈవో శామ్యూల్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, స్క్వాడ్ తనిఖీలు చేశాయి.

బనవాసి కేవీకేలో శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్స్ శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమాల్లో మొదటి రోజు డీసీవో రామాంజనేయులు పాల్గొని కోర్స్ ఆవశ్యకతను తెలియజేశారు. డీసీవో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లోని రైతులకు జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు నేల రకాలు, నేలలోని మొక్కల పోషకాలు, భూమిలోని ప్రాథమిక, ద్వితీయ పోషకాల పాత్ర, వాటిలోప లక్షణాలు, మొక్కలలోని సూక్ష్మపోషకాల పాత్ర, సేంద్రీయ ఎరువుల రేటింగ్ వివరాలు తెలియజేసినట్లు చెప్పారు. కేవీకే కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత, సుజాతమ్మ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు



- ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ ధనలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత రబీలో రైతులకు రాయితీపై పప్పుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. బుధవారం కల్లూరు ఎస్టేట్‌లోని ఏపీ సీడ్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన పప్పుశనగ విత్తనాలను నాణ్యత కలిగి క్లీనింగ్ చేసిన విత్తనాలను నందికొట్కూరు, కడప ప్రాంతాల్లోని ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి రైతు సలహా కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. నాణ్యత విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పరితో పాటు కర్నూలు డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలకు సరఫరా చేసిన పప్పుశనగ విత్తనాలు కొంత నాసిరకంగా ఉన్నట్లు తేలిందని, వెంటనే ఆ విత్తనాలను వెనక్కి పంపి మళ్లీ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు. తమ సిబ్బందితో పాటు వ్యవసాయాధికారులు, రైతు సలహా కేంద్రాల సిబ్బంది వివిధ దశల్లో పప్పుశనగ విత్తనాలను పరిశీలించిన తర్వాతనే రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పప్పుశనగ విత్తనాల ధరను క్వింటానికి రూ.9 వేల ప్రకారం నిర్ణయించిందని, ఈ విత్తనాలను శుద్ధి చేసి, రైతు సలహా కేంద్రాలకు చేరవేసే బాధ్యతను కూడా ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులే తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అందువల్లనే ధర పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

కొత్త దుకాణాలు పాత ధరలు

- తొలి రోజు తెరుచుకున్నది 54 దుకాణాలే..
- సాంకేతిక లోపంతో మద్యం సరఫరా ఆలస్యం



షాపులు అద్దెకు దొరకక అవస్థలు

కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాలు, పత్తికొండ, ఆలూరుల్లోని పలు మండలాల్లో మద్యం దుకాణాల కోసం చాలా మందికి అద్దె షాపులు దొరకడం లేదు. దొరికినా యాజమానులు అద్దెలు అధిక మొత్తంలో చెబుతుండడంతో లైసెన్సుదారులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసినప్పుడే మాట్లాడుకున్న వారు మాత్రమే ప్రస్తుతం దుకాణాలను ప్రారంభించారు. జిల్లాలో చాలా వరకు షాపులు దొరకక మద్యం లైసెన్స్ పొందిన వారు అవస్థలు పడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకులు తమ పలుకుబడితో ఇతరులకు షాపులను అద్దెకు ఇవ్వకుండా వాటా కోసం లైసెన్స్‌దారులను వేధిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

కర్నూలు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కేటాయింపులో కీలక ఘట్టం ముగిసింది. దీంతో దుకాణాల ఏర్పాటులో ప్రైవేట్ మద్యం వ్యాపారులు హడావిడిగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత పద్ధతిని రద్దు చేసి కొత్త మద్యం విధానం తెరమీదకి తెచ్చి బుధవారం నుంచి అమలులోకి తీసుకువచ్చింది. జిల్లాలో 99 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫై చేసి లాటరీ ద్వారా కేటాయించింది. అందులో బుధవారం 54 దుకాణాలు మాత్రమే తెరుచుకున్నాయి. నూతన మద్యం పాలసీ అమలులోకి రావడంతో నాణ్యమైన మద్యంతోపాటు ధరలను తగ్గిస్తామని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ మద్యం దుకాణాల్లో యథావిధిగా అధిక ధరలకే మద్యాన్ని విక్రయిస్తున్నారు. పేరుకే కొత్త దుకాణాలని, ధరలు మాత్రం తగ్గలేదని మందు బాబులు మద్యం దుకాణాల వద్ద వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ కనిపించారు. దుకాణాలు దక్కించుకున్న వారు అద్దెకు షాపులు దొరకక.. సర్వర్ లోపంతో మద్యం అందక మందుబాబులు నిరాశలో ఉన్నారు. ఇష్టమైన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రావడంతో కొంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త ధరలకు సంబంధించి జీవో జారీ అయినప్పటికీ అమలుకు కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాల్సి ఉందని ఐఎంఎల్ డిపో అధికారులు తెలిపారు.

సర్వర్ లోపంతో సరఫరా ఆలస్యం..

జిల్లా కేంద్రంలోని పందిపాడులోని ఐఎంఎల్ డిపోలో సరుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మంగళవారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టాక్ వివరాలు సాఫ్ట్ వేర్‌లో అప్‌లోడ్ సమస్యతో దుకాణాలకు కొత్త మద్యం సరఫరా కొంత ఆలస్యమవుతోందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.



గుడి, బడికి దూరంగా ..

బడికి, గుడికి దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని కొన్ని నిబంధనలను విధించింది. నూతన మద్యం పాలసీలో నిబంధనల మేరకు దుకాణాల ఏర్పాట్లను పరిశీలించి శాశ్వత అనుమతులు మంజూరు చేస్తారు. అందులో ప్రధానంగా ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలకు వంద మీటర్లకు పైగా దూరం ఉంటేనే మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన దేవదాయశాఖ ఆలయాలు, మసీదులు, చర్చిలకు వంద మీటర్లకు అవతల వైపు ఏర్పాటు చేసుకోవచ్చు. నగర పాలక, పురపాలక సంస్థల పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్లినా మద్యం దుకాణాల ఏర్పాటుకు అభ్యంతరం లేదు. 20 వేలకన్నా జనాభా తక్కువ గల గ్రామాల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళుతుంటే 220 మీటర్లకు దూరంగా దుకాణాలు ఉండాలని, 20 వేల జనాభాకన్నా అధికంగా ప్రజలు ఉన్న గ్రామాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులు హైవేలకు 500 మీటర్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవచ్చని ప్రభుత్వ నిబంధనలను విధించింది.

వసతి గృహం తనిఖీ



తనిఖీ చేస్తున్నకార్యదర్శి శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గార్గేయపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్ రికార్డులు, విద్యార్థులకు అందజేస్తున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో ఏవైనా లోపాలు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులకు సూచించారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో బుధవారం మండలస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. భూముల ఆన్‌లైన్ సమస్యలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, డంప్‌యార్డ్‌తో ఇబ్బందులు పడుతున్నామని మునగాల, మల్లాపురం గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివనాగప్రసాద్, కమిషనర్ నాగరాజు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, టీడీపీ నాయకులు సృజన్, పౌలు, సురేష్, మహే శ్వర రెడ్డి, చాంద్‌బాషా, విజయ్‌కుమార్, వహీద్ పాల్గొన్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ)కు ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రేడియాలజి విభాగంలో జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.చెన్నమ్మ నామినేషన్లను స్వీకరించారు. అధ్యక్ష పదవికి మూడు, కోశాధికారి పదవికి మూడు నామినేషన్లు రాగా మిగిలిన పదవులకు రెండు చొప్పున నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి చెన్నయ్య తెలిపారు. ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికల్లో గుర్తులు ఉండవని, అభ్యర్థి మాత్రమే ఉంటుందని, అక్కడ ఓటర్లు మార్కు చేయాలన్నారు.

అధ్యక్షురాలుగా ఆదిలక్ష్మి నామినేషన్: ఎన్నికల్లో ఓ ప్యానల్‌కు అధ్యక్షురాలిగా కర్నూలు జీజీహెచ్‌కు చెందిన హెడ్ నర్సు పి.ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డి.మంజులదేవి (కర్నూలు జీజీహెచ్ స్టాఫ్ నర్సు), కోశాధికారి జి.విజయమ్మ (హెడ్ నర్సు కర్నూలు జీజీహెచ్), వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీదేవి (హెడ్ నర్సు కర్నూలు జీజీహెచ్)తో పాటు ఈసీ సభ్యులుగా పి.లీలారాణి, కే శ్రీదేవి, ఎం.కళ్యాణి, కె.సుజాత, జి.రమణిదేవి నామినేషన్లు వేశారు.

అధ్యక్షురాలిగా ఎం.లీలావతి నామినేషన్: మరో ప్యానల్‌కు కర్నూలు జీజీహెచ్‌కు చెందిన హెడ్ నర్సు మండ్ల లీలావతి, ప్రధాన కార్యదర్శిగా సి.బంగారి (కర్నూలు జీజీహెచ్ స్టాఫ్ నర్సు), కోశాధికారి ఎస్.లక్ష్మీనరసమ్మ (గోనెగండ్ల పీహెచ్‌సీ హెడ్‌నర్సు), వైస్ ప్రెసిడెంట్‌గా జి.శాంతిభవాని (నర్సింగ్ కాలేజీ కర్నూలు పీహెచ్ఎన్‌టీ), ఈసీ సభ్యులుగా యూఎం శాంతిలత, జే ఉమారాణి, ఎ.ఉమాదేవి, డి.కృష్ణవేణి, ఎస్.సోమేశ్వరి నామినేషన్లను వేశారు. అధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా కర్నూలు జీజీహెచ్‌కు చెందిన హెడ్ నర్సు కే ఉమా నామినేషన్ వేశారు.





ఎన్నికల అధికారికి నామినేషన్లు అందజేస్తున్న ఇరు ప్యానెళ్ల సభ్యులు

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

గోనెగండ్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కులుమాల గ్రామంలో కృష్ణవేణి (27)ని హత్య చేసిన భర్త పక్కీరప్పను అరెస్టు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ఈనెల 13న మద్యం తాగడానికి పక్కీరప్ప భార్య కృష్ణవేణిని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో పక్కీరప్ప కృష్ణవేణి తలపై రాతి కొట్టి హత్య చేశాడు. కృష్ణవేణి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బుధవారం సాయంత్రం కులుమాల, చిన్నమరివీడు గ్రామాల మధ్య నల్లపోచమ్మ గుడి దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతు న్న వ్యక్తిని విచారించగా పక్కీరప్ప అని తెలియడంతో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.



పక్కీరప్పను అరెస్టు చేసిన పోలీసులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంత్రాలయం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపిన వివరాలివీ.. ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి చెందిన గొల్ల హనుమప్ప (42) మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో మంగళ వారం దస్తగిరి స్వామి ఉరుసుకు వచ్చారు. అయితే సాయంత్రం తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే వగరూరు సమీపంలోనే ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన హనుమప్పను కర్నూలు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందు తూ బుధవారం మృతిచెందారు. హనుమప్పకు భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. హనుమప్ప మృతదేహానికి కర్నూలు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు క్రైమ్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పందిపాడు గ్రామంలో అప్పుల బాధ తాళలేక షేక్ యూనుస్ (56) ఆత్మహత్య చేసుకు న్నాడు. యూనుస్ స్థానికంగా పాన్‌షాపులో పని చేస్తుండేవాడు. ఆయన కు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. కుటుంబ పోషణ కోసం రూ.4 లక్షల అప్పులు చేశాడు. మంగళవారం యూనుస్ కూతురు డెలివరీ కావడంతో అందరూ ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన భార్య, కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య జులేఖాబి ఫిర్యాదు చేశారు.



యూనుస్ (ఫైల్)

పెళ్లింట విషాదం





కల్వర్టులో పడిపోయిన బైక్, మృతి చెందిన రాముడు

- రోడ్డు ప్రమాదంలో పెళ్లి కూతురు సోదరుడి మృతి
- నిలిచిపోయిన పెళ్లి వేడుక

కర్నూలు క్రైమ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెల్లారితే పెళ్లి.. బంధువులంతా ఆటోలో బయలుదేరారు. ఇంటికి పెద్ద దిక్కయిన ఆ కొడుకు వారందరినీ సాగనంపి ఇంటికి తాళం వేసి తాను బయలుదేరాడు. మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో పెళ్లి ఆగిపోయింది. ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాముడు (19) అనే యువకుడు దుర్మరణం చెందాడు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన సువర్ణమ్మ, గిడ్డయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం. గిడ్డయ్య పదేళ్ల క్రితం మృతి చెందడంతో సువర్ణమ్మ తన భర్త ఊరు వెంకటగిరి గ్రామం వదిలేసి పుట్టినిల్లయిన కల్లూరు మండలం కే మార్కాపురంలో నివాసం ఉంటోంది. పెద్ద కూతురుకు ఇదివరకే పెళ్లి చేసింది. చిన్న కూతురుకు పుల్లగుమ్మికి చెందిన ఓ యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం ఉదయం 10 గంటలకు తలంబ్రాలు ఉండడంతో కుటుంబ సభ్యులంతా బంధువులతో కలిసి బొలేరో వాహనంలో మంగళవారం రాత్రి కే మార్కాపురం నుంచి బయలుదేరారు. రాముడు బంధువులనంతా సాగనంపి ఇళ్లంతా సర్దిన అనంతరం ఇంటికి తాళం వేసి తన మిత్రుడు కేసుల స్వామితో కలిసి మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. చిన్నటేకూరు సమీపంలో మట్టి కుప్పలు అడ్డంగా ఉండటాన్ని చీకటిలో గుర్తించలేని రాముడు మోటారు సైకిల్‌ను వాటిపైకి ఎక్కించాడు. దీంతో అదుపు తప్పి పక్కన ఉన్న కల్వర్టులో పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత బంధువులకు సమాచారం ఇవ్వడంతో పెళ్లికి బయలుదేరిన బృందమంతా తిరిగి ఆసుపత్రికి చేరుకుంది. చికిత్స పొందుతూ రాముడు తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. దీంతో పెళ్లి ఆగిపోయింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌడేశ్వరీ దేవికి పట్టువస్త్రాల సమర్పణ



చౌడేశ్వరీ దేవికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న గౌరు దంపతులు

ఓర్వకల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరువెంకటరెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమం తొగట వీరక్షత్రియ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అంతకుముందు గౌరు దంపతులకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చౌడేశ్వరిదేవి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు రాం భూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిప్పాయపల్లె సుధాకర్ రెడ్డి, ఏసేపు, అబ్దుల్లా, శోభన్‌బాబు పాల్గొన్నారు.

పకడ్బందీగా చర్యలు : కమిషనర్



మురుగుకాలువను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం లోపించకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. బుధవారం కృష్ణానగర్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ఆయన పరిశీలించారు. డెక్కన్ బిర్యానీ సెంటర్ సమీపంలో కల్వర్టు సామర్థ్యం తక్కువగా ఉండటంతో మురుగు నీరు పక్కనున్న ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మురుగు కాలువల్లో ప్రవాహానికి చెత్తచె దారం ఆటంకం లేకుండా చూడాలని, రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు, పైపులు ఎటువంటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాడు, చనుగొండ్ల, వై ఖానాపురం గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే పాల్గొని అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఇందులో భాగంగా గుడిపాడులో భాగంగా రూ.24లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.2.30 లక్షలతో గోకులం నిర్మాణానికి, అలాగే చనుగొండ్లలో రూ.7 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.2.30 లక్షలతో గోకులం నిర్మాణానికి, వై ఖానాపురంలో రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్ర మంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివ నాగప్రసాద్, టీడీపీ నాయకులు గుడిపాడు మహేశ్వర రెడ్డి, జె సురేష్, కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య, హలీఫ్ బాషా పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పాలకొల ను, చింతలపల్లె, కన్నమడకల, తిప్పాయపల్లె గ్రామాల్లో ఉపాధి కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటరమణ, చదువుల సుజాతమ్మ, చిన్నకాశీం, ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఏపీ వో కుమార సాయినాథ్, నాయకులు సుధాకర్‌రావు, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, తిప్పాయపల్లె సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి,
తడకనపల్లెలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఈవోఆర్డీ, టీడీపీ నాయకులు

కల్లూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కల్లూరు ఈవోఆర్డీ నగేష్ తెలిపారు. బుధవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామ సర్పంచ్ సహరాబీ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద ఎంపికైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ మాట్లాడుతూ తడకనపల్లెలో రూ.21లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దీశ్వరమ్మ, సెక్రటరీ షేక్షావలి, ఉప సర్పంచు వెంకటేశ్వర్లు, జుబేదాబేగం, జనసేన నాయకుడు సలాం పాల్గొన్నారు.

సి.బెళగల్: పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని పోలకల్లు, ముడుమాల గ్రామాల్లో సర్పంచులు మాదమ్మ, బతుకమ్మ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పోలకల్లు గ్రామానికి రూ.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. అనంతరం పోలకల్లు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఏపీవో రామన్న మాట్లాడుతూ ఉపాధి నిధులతో గ్రామాల్లో కాలువలు పూడిక తీత, ఇంకుడు గుంతలు, ఫారం పండ్స్ పసువుల షెడ్డు నిర్మాణాలకు మంజూరైన నిధులతో పనులను త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకట్ ప్రకాశ్, ఉపాధి ఈసీ రంగస్వామి, టీడీపీనాయకులు అమర్, తిమ్మప్ప, రమేష్ పాల్గొన్నారు.





చింతలపల్లెలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ వెంకటరమణ, పోలకల్లులో..

ఉప సర్పంచులకు శిక్షణ

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18, 19వ తేదీల్లో కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహించే శిక్షణలో తప్పకుండా హాజరు కావాలని కోరారు. .

టీడీపీ కార్యకర్త మృతి

సి.బెళగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మల్లేపోగు సుందరరాజు (38) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. సుందరరాజుకు గుండెలో మంట ఉందని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు శంకర్‌బాబురెడ్డి, రఘునాథరెడ్డి పార్థీవదేహానికి పులమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ మండల కన్వీనర్ పాండు రంగన్న గౌడు, మండల కన్వీనర్ గోవిందుగౌడు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి మహర్షి శోభాయాత్ర

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి గౌరిగోపాల్ హాస్పిటల్ వద్ద వాల్మీకి సర్కిల్ వరకు వాల్మీకి మహర్షి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు కుంపటి కృష్ణయ్య, రామాంజనేయులు, రాజు, రామనాయుడు, అశోక్ తెలిపారు. వాల్మీకులంతా శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ వ్యవ స్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు బి. వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబరు 31న ముంబైలో ఏఐటీయూసీని స్థాపించారన్నారు. టీడీపీ ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ విధానాన్ని తీసుకువస్తామని, భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు అవుతున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్ డీఏ అరియర్స్‌తోపాటు సమ్మెకాలపు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం మద్దిలేటి, బాబులాల్, స్వాములు, నాగేషులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవుడు ప్రొఫెసర్ సాయిబాబ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పదేళ్లపాటు అక్రమంగా నిర్బంధించినా ప్రజల స్వేచ్ఛ కోసం తన నైతికశక్తితో, రాజకీయ దృక్పథంతో దృఢంగా నిలబడిన ప్రొఫెసర్ సాయిబాబ ప్రపంచ మానవుడని విరసం నాయకుడు పాణి అన్నారు. మేధావులను బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల మృతి చెందిన ప్రొఫెసర్ జీయన్ సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. కర్నూలు కవుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. అంతకు ముందు దివంగత సాయిబాబా చిత్రపటానికి జోహార్లు అర్పించారు. ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ మాట్లాడుతూ పేదలు, ఆదివాసుల హక్కుల కోసం, మానవ హక్కుల కోసం ప్రొఫెసర్ సాయిబాబా పోరాటం చేశారని గుర్తు చేసుకున్నారు. విరసం నేత పాణి మాట్లాడుతూ సమాజం కొత్త దశకు చేరుకుంటున్న కాలంలో సాయిబాబా మనకు దూరమయ్యారని అన్నారు. ఆయన జైలు గదిలో నేను చావును నిరాకరిస్తున్నాను అని రాశారని అన్నారు. సాయిబాబా లోతైన కవిత్వం రాశారని, ఆయన అనేక పోరాటాలను కవిత్వంగా చిత్రించారని అన్నారు. జైలులో ఆయన్ను బంధించవచ్చును కొని రాజ్యం అనుకుంటే ఆయన మాత్రం ప్రపంచ మానవుడిగా బయటకు వచ్చారని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ కవిగా, మేధావిగా సాయిబాబా కొత్త సమాజం కోసం కృషి చేశారని శ్లాఘించారు. విరసం నాయకుడు నాగేశ్వరాచారి మాట్లాడుతూ రాజ్యం చేసిన కుట్రకు బలైన మేధావి సాయిబాబా అని అన్నారు. సభ ప్రారం భానికి ముందు మహ్మద్ మియా అభ్యుదయ గీతాలు ఆలపించగా, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ ఆహ్వానం పలికారు.



ప్రసంగిస్తున్న విరసం నేత పాణి

కలెక్టర్, ఎస్పీలకు అభినందన



కలెక్టర్‌ను అభినందిస్తున్న జేవీవీ నాయకులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్నీ ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించినందుకు కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్‌లను కలిసి జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేష్ కుమార్ అభినందనలు తెలిపారు. బన్నీ ఉత్సవాలకు 2.30 లక్షల మంది హాజరయ్యారని, తక్కువ సంఖ్యలో చిన్నపాటి గాయాలతో ఉత్సవం సాంప్రదాయబద్ధంగా జరిగిందన్నారు. జేవీవీ విద్య, ఆరోగ్యం, మహిళ సాధికారత, మూఢనమ్మకాల నిర్మూలన, యువత పర్యావరణ విభాగాల్లో పని చేస్తుందని, ఇందులో సేవలు అవసరమున్న చోట ఉపయోగించుకోవాలన్నారు. కలెక్టర్ పి. రజింత్‌బాషా మాట్లాడుతూ ఎస్పీ, ఆదోని సబ్ కలెక్టర్‌తోపాటు అక్కడి వివిధ విభాగాల సిబ్బంది సమన్వయంతో పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, మహ్మద్‌మియా, శేషాద్రిరెడ్డి పాల్గొన్నారు.

యంత్ర సామగ్రి చోరీ



క్రేన్ ట్రాక్టర్ టైర్లు ఎత్తుకెళ్లిన దృశ్యం

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 16: మండలంలోని గోరంట్ల హంద్రీలో వంతెన నిర్మాణ పనులకు సంబంధించిన యంత్ర సామగ్రిని దుండగులు దొంగలించారు. గత ప్రభుత్వంలో హంద్రీనదిపై వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే బిల్లుల పెండింగ్ కారణంగా వంతెన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో కాంట్రాక్టర్ వాహనాలను ఒడ్డుకు చేర్చి పనులు వదిలేసి వెళ్లిపోయారు. ఇదే అదునుగా దుండగులు చేతివాటం ప్రదర్శించారు. యంత్రాల్లో ట్రాక్టర్ క్రేన్ రెండు పెద్ద టైర్లు, బ్యాటరీ, మెషిన్ బ్రేకర్‌ను దొంగలించారు. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వరరెడ్డి సిబ్బంది తో పోలీసులకు ఫిర్యాదు చేయించారు. వీటి విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఏఎస్పీకి వీడ్కోలు



నాగబాబును సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు క్రైమ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ ఎస్పీ నుంచి నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన నాగబాబును జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో హోం గార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, డీఎస్పీలు శ్రీనివాసాచారి, శ్రీనివాసరావు, కృష్ణమోహన్ శాలువ కప్పి సన్మానించారు. ఈయన నాన్ క్యాడర్ ఎస్పీ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ విజయవాడకు బదిలీ అయ్యారు.

ఘనంగా అనస్థీషియా దినోత్సవం



క్యాజువాల్టీలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలోని క్యాజువాల్టీలో వరల్డ్ అనస్థీషియా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రామశివ నాయక్, జనరల్ సర్జరీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ నాయక్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోగికి నొప్పి తెలియకుండా ఆపరేషన్లు చేయడంలో మత్తు మందు వైద్యుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు శారద, సుబ్రహ్మణ్యం, సర్జరీ మన్సూర్‌బాషా, అంకాలజీ వైద్యులు చైతన్య, సీఎంవో ఫయాజ్, హెడ్‌నర్సులు, స్టాఫ్ నర్సులు, అనస్థీషియా టెక్నీషియన్ దినేష్ పాల్గొన్నారు.

'లయన్స్ క్లబ్ సేవలను ముందుకు తీసుకెళ్తాం'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని లయన్స్ క్లబ్ కర్నూలు అధ్యక్షుడు పి. శైలేంద్ర, క్లబ్ అడ్మిన్ అధికారి రత్నప్రసాద్ అన్నారు. బుధవారం నగరంలోని 48వ వార్డు రోజావీధిలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన కంటి వైద్య పరీక్షల్లో చికిత్సలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి కంటి అద్దాలు లయన్స్ క్లబ్ ఉచితంగా అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళ్లపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై శిక్షణ

కోడుమూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 16: మండలంలోని ప్యాలకుర్తి ఆర్‌ఎస్కేలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమానికి సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ రత్నకుమార్ హాజరయ్యారు. పశు వైద్యాధికారి బాల స్వామి మాట్లాడుతూ ప్రతి సీజన్‌కు ముందు గొర్రెలు, పశువులకు టీకాలు వేయించుకోవాలని తెలిపారు. అనంతరం వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆధ్వర్యంలో పంటలను పరిశీలించారు. ఏరువాక కేంద్రం సైంటిస్ట్ కిషోర్‌కుమార్, ఎంపీటీసీ సందప్ప పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టండి

ఓర్వకల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సాగుపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. పొగాకు, కంది పంటలను పరిశీలించారు. పొగాకు పంటలో అక్కడక్కడ ఆకుముడుత తెగుళ్లను గమనించామన్నారు. దీని నివారణకు థయోమీథక్సమ్-2 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఏఈవో మధు, రైతు సేవా కేంద్రం సిబ్బంది వై.నగేష్, ఎస్.మోహన్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో రాణించాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. బుధవారం డీఎస్ఏ స్టేడియంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల పేర్లను ప్రకటించారు. ఈనెల 18 నుంచి కాకినాడలో రాజాస్ ట్యాంకులోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో నిర్వహించే 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-11లో ఎం పికైన వారు సోయాల నింజీష, మాన్విశ్రీ, ప్రీతిక రెడ్డి, బాలురలో శ్రీథిక్ చౌదరి, ప్రిన్స్‌లియో, హితాక్ష్, అండర్-14లో సాహితి, ఇక్షితరెడ్డి , బాలురలో జయంత్ రెడ్డి, మహ్మద్ రయాన్, అండర్-17లో శామ్యూల్ రెనాల్డ్ ఉన్నారు. స్కేటింగ్ ఉపాధ్యక్షుడు పి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రైతులు పంటలను కాపాడుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలతో పంటలను కాపాడుకోవాలని ఏవో అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని లేకపోతే వేరే కుళ్ళు ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. పత్తి కోత మొదటి రెండు దశలో ఉన్నాయని వాయిదా వేసుకోవాలని సూచించారు. లేదా త్వరగా పూర్తిచేసుకుని పత్తిని వర్షంలో తడవకుండా కాపాడుకోవాలన్నారు. వేరుశనగ కాయలు తడవకుండా టార్పాన్‌తో కప్పి ఉంచాలని వివరించారు.

మద్యం దుకాణం వద్దు

- ఆలయం పక్కనే ఏర్పాటుపై మహిళల అభ్యంతరం

ఆదోని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభాకర్ టాకీస్ రోడ్డులో పురాతన శివాలయం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానిక మహిళలు అభ్యంతరం తెలిపారు. బుధవారం మున్సిపల్ ఛైర్పర్సన్ శాంతకు వినతిపత్రం ఇచ్చారు. రాజేశ్వరి, జయజైన్, రేఖజైన్, శ్యామల మాట్లాడుతై నిబంధనలు


చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

పాటించకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు సమంజసం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. శివ స్వాములు అక్కడే దీక్ష తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సోమ, శనివారం రోజుల్లో ఆలయంలో పూజలు చేసేందుకు భక్తులు వచ్చి వెళ్తుంటారన్నారు. నివాసాలు, గుడి, బడికి 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు ఉన్నా ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంతో అమలు కావడం లేదని నిలదీశారు. కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, డీఎస్పీ ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తామన్నారు. అప్పటికీ స్పందించకుంటేన రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తామని హెచ్చరించారు.

స్పందించిన చైర్పర్సన్

స్పందించిన యచైర్‌పర్సన్ శాంత మహిళలు ఇబ్బంది పడే చోట మద్యం దుకాణం వద్దని ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

సహకార బ్యాంకులో అధిక వడ్డీ

తుగ్గలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీలు లభిస్తాయని మారెల్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం పెండేకల్ ఆర్.ఎస్.మారెళ్ల గ్రామాల్లో కర్షక అభివృద్ధి, డిపాజిట్ పథకం పై ప్రజలకు వివరించారు. సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ అందుతుందన్నారు.

తుఫాన్ కంట్రోల్ రూం ఏర్పాటు

ఆదోని టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాన్ బాధితుల సహాయార్థం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ కృష్ణ బుధవారం తెలిపారు. అత్యవసర సాయం కోసం 24 గంటలు అందు బాటులో ఉంటారని 08512-295468కు ఫోన్ చేయాలని సూచించారు.

సీసీఐ కొనుగోళ్లను ప్రారంభించాలి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పత్తి ధరలు పతనమవుతున్నాయని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోళ్లను ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రైతులు ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొని మార్కెట్ యార్డుకు తెస్తే వ్యాపారుల మాయాజాలంతో ధరల రూపంలో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.7521 కంటే తక్కువగా కొనుగోలు చేస్తున్నారన్నారు. క్వింటాలుకు రూ.10వేలు ఇవ్వాలని కోరారు.

సెలవుగా ప్రకటించాలి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని వాల్మీకి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. నేడు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వాల్మీకి జయంతిని ప్రభుత్వం పండుగగా చేయాలన్న నిర్ణయాన్ని హర్షిస్తున్నామన్నారు. సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చిత్తశుద్ధి ఇదేనా..?

ఆలూరు, అక్టుబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయాని ఎంపీపీ జెట్టప్ప గారి రంగమ్మ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండల సర్వ సభ్య సమావేశాన్ని కోరం లేక వాయిదా వేశారు.

కూలిన మట్టిమిద్దె

పత్తికొండ టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరి వీధి పెద్దమ్మవ్వ గుడి వెనుక ఉన్న షైనాబీబీ అనే మహిళకు చెందిన మట్టి మిద్దె కూలింది. పెద్ద శబ్దం రావడంతో షైనాబీబీ కొడుకుతో బయటకు పరుగులు తీశారు. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

సీఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్


గోకులం షెడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. మండలంలోని తుంబలబీడు, హలేబీడు గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున సీసీ రోడ్లు, గోకులం షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారను. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె ప్రగతికి ఉపాధి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి బాటలు వేశారని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్పంచులు మంజమ్మ, సోమలింగమ్మ, కన్వీనర్ అశోక్ యాదవ్, ఎపీవో శ్రీనివాసులు, కోఆర్డినేటర్ సురేష్, ఎస్ఐ వెంకట నరసింహులు, టీడీపీ సీనియర్ నాయకులు కేశన్న, బాలరాజు, కుపేంద్ర, యంపీటీసీ రమేష్, వెంకటేశ్వర్లు, దేవేంద్ర, బంగారు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఉరుకుంద, నిఖిల్ మోడీ, టెక్నికల్ అసిస్టెంట్ శర్మిష్ పలి పాల్గొన్నారు.

ఆదోని లోతట్టు ప్రాంతాల పరిశీలన


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను సబ్ కలెక్టర్ భరద్వాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. వడ్డెగేరి, హనుమాన్ నగర్, శ్రీనివాస భవన్ సర్కిల్, సబ్ జైలు ప్రాంతంలోని రైల్వే ట్రాక్ వద్ద వంక, పాత ఫ్లైఓవర్ ప్రాంతాలలో తిరిగి పరిస్థితులను అంచనా వేశారు. భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు. సచివాలయాల సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతధికారులకు అందజేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. వర్షం నీటిని బయటికి తోడివేయడానికి మోటార్లను, జేసీబీలను, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఎంఈ ఇంతియాజ్, డీఈ రామమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణసింగ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి ఆర్డీవో

హాలహర్వి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో భరత్ నాయక్ సూచించారు. బుధవారం బాపురం వద్ద ఎల్లెల్సీని పరిశీలించారు. వేదవతి, పెద్ద వాగు సమీప ప్రాంత ప్రజలకు సమాచారం అందించాలన్నారు.

జొన్న పంటను నాశనం చేశారు

- మణేకుర్తిలో కుమారులపై తల్లి ఫిర్యాదు

ఆలూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన జొన్న పంటను తన కుమారులే గడ్డి మందు కొట్టి నాశనం చేశారని బుధవారం మణేకుర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు అగ్రహారం ఈరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.. బాధితురాలి కథనం మేరకు.. గ్రామంలో రెండవ కుమారుడు తిమ్మప్పతో ఉంటున్నట్లు 9.82 ఎకరాల భూమిలో జొన్న సాగు చేశానని తెలిపారు. పొలంలో భాగం ఇవ్వాలని పెద్ద కుమారుడు, రమేష్, చిన్న కుమారుడు సతీష్ పలుమార్లు తనతో గొడవ పడి వెళ్లారని కోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిపారు. వాళ్లకు మద్ధికెర అగ్రహారంలో తండ్రి ఆస్తి క్రింద పొలాలు ఉన్నాయన్నారు.. ఆన్‌లైన్, అడంగల్‌లో పొలం తనపేరు పైనే ఉందన్నారు. మణేకుర్తి పొలంలో భాగం ఇవ్వనందుకే తనపెద్ద కుమారుడు రమేష్, చిన్న కుమారుడు సతీష్ కోపంతో ఇలా చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి మధు పొలాన్ని పరిశీలించారు.


పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి

జొన్న పంటపై గడ్డి మందు పిచికారీ చేసినందువల్లే పంట రంగు మారిపోయిందని నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు.

పల్లెల్లో పండుగ వాతావరణం

మద్దికెర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో పండుగ వాతావరణం కనిపిస్తోందని సర్పంచ్ నందికల్పన, సలహాదారులు నంది జయరాం, టీడీపీ నాయకులు ఆకుల వేమన్న అన్నారు. బుధవారం మండలంలోని ఎడవలి గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. కార్యదర్శి పరమేశ్వరప్ప, పంచాయితీరాజ్ ఏఈ విష్ణువర్దన్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆదర్శ ప్రాయుడు : ఎమ్మెల్యే


విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి ఆదర్శప్రాయుడని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం చిన్నగిరి ముండలం దేగులపాడు గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వాల్మీకి రామాయణం రచించి చరిత్రలో నిలచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైసీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య, మాజీ సొసైట్ అధ్యక్షుడు, మల్లికార్జున, సర్పంచ్, నీలకంఠ, మల్లికార్జున, లాల స్వామి, లింగన్న, నాగిరెడ్డి, నారాయణస్వామి, శివ, అలంకర్, నరేంద్ర, సర్పంచులు ఓబులపతి, సేనాపతి పాల్గొన్నారు.

దుకాణదారుడు, రైతు వాగ్వాదం


వాగ్వాదం చేసుకుంటున్న ఇరువురు

ఆదోని, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి): తనకు కావాల్సిన కంపెనీ విత్తనాలు ఇవ్వకుండా వేరే కంపెనీవి ఇచ్చారని దుకాణదారుడితో రైతు వాగ్వాదానికి దిగాడు. వివరాలు.. పట్టణంలోని గీతా సీడ్స్ దుకాణంలో కపటి గ్రామానికి చెందిన రైతు రాజు 12 కేజీల మినుము విత్తనాలను ఈనెల 14న కొనుగోలు చేశాడు. మరునటి రోజు సాయంత్రం రైతు రాజు వచ్చి, తన కుమారుడు అంకూర్ కంపెనీ విత్తనాలు ఇవ్వమంటే, వేరే కంపెనీ విత్తనాలు ఎందుకు ఇచ్చారని నిలదీశాడు. తన వద్ద లేకపోవడంతో ఆ విత్తనాలు ఇచ్చానని, దుకాణ యజమాని చెప్పుకొచ్చాడు. వారి మధ్య మాటమాట పెరిగి తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరుష పదజాలంతో దూషించుకున్నారు. ఒకరిపై ఒకరు చేయి చేసుకునేంత వరకు వచ్చారు. చివరకు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. అక్కడ రాజీపడి బయటకు వచ్చాక ఎమ్మెల్యేకు, వ్యవసాయ అధికారికి రైతు రాజు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బెంగళూరు పోలీసుల అదుపులో ఆదోని వ్యాపారి

ఆదోని, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బంగారు దుకాణ యజమానిని బెంగళూరు సిటీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా బెంగళూరు సిటీ పోలీసులు దొంగను విచారించిన నేపథ్యంలో తాను దొంగలించిన 25 గ్రామల బంగారాన్ని ఆదోని షరాఫ్ బజారులోని ఓ జ్యూవెలరీ షాపులో విక్రయించినట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో బెంగళూరు పోలీసులు బంగారం రికవరీ నిమిత్తం ఆదోని చేరుకొని సదరు బంగారు దుకాణాన్ని తనిఖీ చేశారు. యజమానిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పంట సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఆలూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని ఆలూరు ఏడీఏ సునీత ఏవో వెంకటేశ్వర గౌడ్ అన్నారు. పెద్దహోతూరులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. భారీ వర్షాలతో పత్తి, కంది, సజ్జ, కొర్రపంటలో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. శనగ విత్తనాలను వేసుకునే రైతులు వాయిదా వేసుకోవాలన్నారు.

కూటమితోనే పల్లెలకు మహర్దశ

తుగ్గలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే పల్లెలకు మహర్దశ అని టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్‌నాయుడు, సర్పంచ్ విజయుడు, ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడు అన్నారు. బుధవారం ఎద్దులదొడ్డి, డీసీ కొండ, పై చింతలకొండ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

తగ్గిన వేరుశనగ ధర

ఆందోళనలో రైతులు



మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన వేరుశనగ

ఎమ్మిగనూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌కు పంట ఉత్పత్తులు రాక తగ్గుతున్న సమయంలో వేరుశనగ ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో వేరుశనగ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌కు రోజు వేల క్వింటాళ్ల వేరుశనగ బస్తాలను రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఈ నెల ఆరంభం నుంచి మొన్నటి వరకు ధర రూ. 6 వేల నుంచి రూ. 7 వేల వరకు పలుకుతూ వచ్చింది. అయితే బుధవారం గరిష్ఠ ధర కాస్త రూ.5,970కు పడిపోయింది. ఈనెల 3వ తేదీ క్వింటం వేరుశనగ గరిష్ఠ ధర రూ.7,369 పలుకగా 4వ తేది రూ.7,080, 6వ తేదీ రూ.7029 పలికింది. అటు తరువాత ధరలు ఒక్కసారిగా 8వ తేదీకి రూ.6,600, 9వ తేదీ రూ. 6,570లకు దిగింది. ఇక పండుగ తరువాత 16వ తేదీ ఏకంగా వేరుశనగ ధర రూ. 5970లకు పడిపోయింది. పక్షం రోజుల్లోనే ఏడువేల నుంచి రూ.5900కు పడిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఎమ్మిగనూరు చుట్టు ముట్టు ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వేరుశనగ 1065 బస్తాలు అమ్మకానికి రాగా క్వింటం కనిష్ఠ ధర రూ.2009 గరిష్ఠ ధర రూ. 5970 పలికాయి. అలాగే ఆముదాలు 133 బస్తాలు రాగా క్వింటం కనిష్ఠ ధర రూ. 4809 గరిష్ఠ ధర రూ.5,831 పలికాయి.

తెరుచుకున్న మద్యం దుకాణాలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు కొన్ని తెరుచుకున్నాయి. ఎమ్మిగనూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 మద్యం దుకాణాలు ఉండగా వీటిని లాటరీలో కొంతమంది రాజకీయ నాయకులు, మద్యం వ్యాపారులు లాటరీలో కైవసం చేసుకున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఎనిమిది మద్యం దుకాణాలు ఉండగా బుధవారం రాత్రి ఒక దుకాణానికి మద్యం రావటంతో అమ్మకాలు మొదలు పెట్టారు. ఇక మిగతా దుకాణాలకు మద్యం స్టాకు రాలేదని తెలిసింది. ఇక మండల పరిధిలో మూడు దుకాణాలు ఉండగా దైవందిన్నె గ్రామంలో మద్యం దుకాణాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఇక నందవరం మండలంలో రెండు దుకాణాలు ఉండగా ఇందులో ఒక దుకాణం ప్రారంభమైంది. మరో దుకాణం ప్రారంభం కావాల్సి ఉంది. అలాగే మంత్రాలయం మండలంలో రెండు దుకాణాలు నేడు ప్రారంభించనున్నట్లు తెలిసింది. గోనెగండ్ల మండలంలో మూడు మద్యం దుకాణాలు ఉండగా ఒక దుకాణం మాత్రం తెరుచుకుంది. ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలో ఉన్న దుకాణాలన్ని గురువారం లేదా శుక్రవారానికి పూర్తి స్థాయిలో తెరుచుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో వెంకటసాయి ఆలయానికి ఎదురుగా రోడ్డుకు అటువైపు మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



పెద్దబావి దగ్గర ఉన్న దుకాణానికి మద్యాన్ని దించుతున్న దృశ్యం

భర్త ఇంటి ఎదుట బైఠాయించిన భార్య

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట భార్య బైఠాయించిన సంఘటన బుధవారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడేకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సురేష్‌కు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రాజేశ్వరి అనే మహిళను ఇచ్చి ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే పెళ్లైన రెండేళ్ల నుంచి భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఆమె వాపోయింది. తనకు ముగ్గురు సంతానం ఉన్నారని తన భర్త సురేష్ తాగుతూ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపింది.



గుడేకల్లులో భర్త ఇంటి ఎదుట బైఠాయించిన బాధితురాలు రాజేశ్వరి

నేడు మంత్రాలయానికి కర్ణాటక హైకోర్టు జడ్జి రాక

మంత్రాలయం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీషానంద గురువారం వస్తున్నారని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి తెలిపారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేయనున్నారు. ఎస్‌ఐ పరమేష్ నాయక్ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి
● గుడేకల్లులో అభివృద్ధి పనులకు భూమి పూజ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుడేకల్లు గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు వేయాలి, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి, తాగునీటి గుమ్మీలను ఎక్కడ ఏర్పాటు చేస్తే ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో వెలసిన నడవలయ్యస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, ఎంపీడీవో బంగారమ్మ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఏపీవో విజయ్‌మోహన్, ఏపీడీ అల్లిపీర, పీఆర్ ఏఈ జయన్న, టీడీపీ నాయకులు దేవదాసు, అయ్యన్న, యలకన్న, సుధాకర్, కౌలుట్ల, మాదన్న, సత్యరాజు, టీడీపీ మండల అధ్యక్షులు పార్లపల్లి మల్లికా ర్జున, అయ్యశప్ప, సురేష్‌చౌదరి, రాఘవేంద్ర, నాగరాజులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలి: ఆదోని మండలం ఆరేకల్లు గ్రామంలో నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను పునఃప్రారంభించాలని విద్యార్థి జేఏసీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. గుడేకల్లు గ్రామంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోమశేఖర్, వీరేష్, శశి, రంగస్వామిలు పాల్గొన్నారు.

కోసిగి: కూటమి ప్రభుత్వంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలకు ప్రాణం పోశారని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని డి. బెళగల్, దొడ్డి గ్రామం, చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి, ఐరంగల్, జంపాపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా రాఘవేంద్రరెడ్డి హాజరై సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేశ్, సర్పంచ్ మాల పద్మమ్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ చంద్రమోహన్, పీఆర్ ఏఈ మాలిక్, టీడీపీ నాయకులు గుండేష్, రంగారెడ్డి, గోపాల్, నరసింహులు, హనుమంతు, హుశేనీ, జనార్దన్, శివ, బసవరాజు, బసప్ప, కోసిగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హనుమాపురం, రాగిమాన్‌దొడ్డి, గంగులపాడు, పెద్దకడబూరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆయా మండల శాఖ అధికారులు, పెద్దకడబూరు సర్పంచ్ రామాంజినేయులు, హనుమాపురం సర్పంచ్ ఇందిర, టీడీపీ మండల అధ్యక్షుడు బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, మీసేవ ఆంజినేయులు, ఆంజి, ఈరన్న, రాజు, లోకదాస్, రాఘవేంద్ర స్వామి, బొగ్గుల తిక్కన్న, బొగ్గుల నరసన్న పాల్గొన్నారు.

మంత్రాలయం: టీడీపీ కూటమి ప్రభుత్వంలో పల్లెలు అభివృద్ధికి చేస్తున్న కృషి అమోఘమని టీడీపీ నాయకుడు రఘునాథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య అన్నారు. బుధవారం మండలంలోని సూగూరు, చెట్నహల్లి, సింగరాజనహల్లి పరమాన్‌దొడ్డి తండా గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, ఏపీవో తిమ్మారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య ఆధ్వర్యంలో సీసీ రోడ్లకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్‌పీ భాస్కర్ రెడ్డి, ఎస్‌ఎం గోపాల్ రెడ్డి, సి. నగేష్, శంకర్ నాయక్, గ్రామ కార్యదర్శులు స్వామినాథన్, షాహీద్, తదితరులు పాల్గొన్నారు.





గుడేకల్లు, డి. బెళగల్‌లో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

ఉపాధి పనులపై ఆరా

కోసిగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దొడ్డి గ్రామం నుంచి చిన్నభోంపల్లికి కారులో వెళ్తూ పొలాల్లో పని చేస్తున్న మహిళా కూలీలతో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది కూలీ పనులు లభిస్తున్నాయా అని, పంటలు ఎలా ఉన్నాయని, కూలీ డబ్బులు ఎంత ఇస్తున్నారని కూలిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈ ఏడాది పనులు దొరుకుతున్నాయని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఆయన వారికి భరోసా ఇచ్చారు.

గ్రామాలతోనే దేశాభివృద్ధి: ఎమ్మెల్యే

కౌతాళం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి గ్రామాలతోనే సాధ్యమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం కౌతాళంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దుదామని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేశ, సర్పంచ్ పాల్‌దినకరన్, తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపీడీవో సుబ్బరాజు, వివిధ శాఖల అధికారులు, వైసీపీ నాయకులు బదినేహాల్ మాబుసాబ్, సోమిరెడ్డి, రామనగౌడ్, పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురుగా వాల్మీకి కల్యాణ మండపం కోసం కేటాయించిన స్థలంలో గురువారం నిర్వహించనున్న వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వీజీఆర్ కొండయ్య, ఏఈ మల్లయ్య, బంగారు వేంకటేశ్వర్లు, లచ్చన్న నాయుడు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి విశిష్ట అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో దయాసాగర్, పుండకూర రంగన్న, జయన్న, ఉసేని, ఉరుకుందు, యాపిలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోసిగిలో దంచికొట్టిన వాన

కోసిగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో బుధవారం వాన దంచికొట్టింది. ఈ వర్షానికి ఎల్లెల్సీ కార్యాలయం వద్ద చెట్టు విరిగి పడింది. వర్షం పడుతున్న సమయంలో అధికారులు ఎవరూ సమీపంలో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వర్షం భారీగా పడటంతో కోసిగిలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి.

పంటలకు సూక్ష్మ పోషకాలు అవసరం

మంత్రాలయం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలపై సూక్ష్మ పోషకాల ఆవశ్యకతను తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ వనరుల శాఖ అధికారులు వెంకటేశ్వర్లు, శశిధర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో ఏవో జీర గణేష్ ఆధ్వర్యంలో పత్తి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సుంకేశ్వరి, మాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కోసిగి: రైతులు సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని బనవాసి శాస్త్రవేత్తలు మౌనిక అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సాతనూరు, అగసనూరు గ్రామాల్లో ఏవో రాజు ఆధ్వర్యంలో మిరప, పత్తి పంటలో వచ్చే తెగుళ్లు, పురుగుల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన ద్వారకనాథ్ అనే భక్తుడు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని దైనందిక సేవకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ: వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావమునకు బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. బుధవారం అశ్వయుజ శుద్ధ చతుర్దశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.

రాయచోటి గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలి

నందవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయచోటి మజరా గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుశేఖర్, హనుమంతు డిమాండ్ చేశారు. బుధవారం నల్లన్న, దేవపుత్ర ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. స్వామిదాసు, దస్తగిరి, శ్రీరాములు పాల్గొన్నారు.

నందవరంలో జలజీవన పనులు ప్రారంభం: మండల కేంద్రమైన నందవరంలో జలజీవన పనులు ప్రాంభమయ్యాయి. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రూ.కోటి 15లక్షలు ఈ పథకం కింద మంజూరు చేయించారు. ఈపనులు పూర్తైతే గ్రామంలో తాగునీటి ఇబ్బందిఉండదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రసన్నకుమార్ తెలిపారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

పెద్దకడుబూరు,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో వరప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలోని పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సాగులో రైతులు సరైన యజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వృద్ధుడు బుధవారం రాత్రి ఫిట్స్ రావడంతో కోమాలోకి వెళ్లాడు. ఫూలే, అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, సభ్యులు ఉప్పర రాములు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా.. వృద్ధుడు మృతి చెందాడు. సీఐ సుదర్శన్ రెడ్డి, కమిషనర్ గంగిరెడ్డి వచ్చి ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం వృద్ధుడికి అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో బీసీ బతకన్న, కానిస్టేబుల్ రామకృష్ణ మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.